క్లుప్తంగా

అనంతుని నమూనా విగ్రహం బహూకరణ



అర్చకుడు పవన్‌కు స్వామి విగ్రహ నమూనాను అందజేస్తున్న ఎంపీపీ రాంబాబు దంపతులు

పద్మనాభం: పద్మనాభంలోని గిరిపై వెలసిన అనంత పద్మనాభ స్వామి ఆలయానికి శేష పాన్పుపై ఉండే అనంత పద్మనాభ స్వామి విగ్రహ నమూనాను ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తులసి లక్ష్మి దంపతులు శుక్రవారం బహూకరించారు. వీరు ఈ విగ్రహాన్ని ఆలయ అర్చకుడు పవన్‌కు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ భోగ మండపంలో దీపాలు వెలిగించే ప్రాంతంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

పద్మనాభం: గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున రోడ్లపై చెత్త లేకుండా చూడాలన్నారు. అపారిశుధ్య పరిస్థితులు ఉంటే డయేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి పాల్గొన్నారు. ముందుగా ఉదయం ఆరు గంటల సమయంలో డీపీవో శ్రీనివాసరావు రెడ్డిపల్లిలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గ్రీన్ అంబాసిడర్లు చెత్త ఎలా సేకరిస్తున్నారో పరిశీలించారు.

నూతన నియామకం



సూరిబాబు

మధురవాడ: సమాచార హక్కు సమన్వయ సంఘం జిల్లా ప్రతినిధుల నియామకం ఇటీవల జరిగింది. ఈ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా మధురవాడకి చెందిన పిళ్లా సూరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్‌టీఐ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కె.వరలక్ష్మి నుంచి నియామక పత్రం అందుకున్నట్టు సూరిబాబు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



రాముడు (ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బుత్తల రాముడు(75) ఈ నెల 17న ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెదికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధుని ఆచూకీ తెలిస్తే 90001 43704, 99085 87031 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. వృద్ధుడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

అడవిని తలపిస్తున్న చిట్టివలస శ్మశానవాటిక



తుమ్మచెట్లు, పొదలతో శ్మశానవాటిక

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటిక పొదలు, చెట్లతో మినీ అడవిని తలపిస్తోంది. దీంతో విషపురుగుల సంచారం బాగా పెరిగి, శ్మశానవాటికకు వచ్చేవారిపై దాడులు చేస్తున్నాయి. అంతేకాకుండా ఎవరైనా చనిపోయిన వారిని పూడ్చి పెట్టేందుకు తీసుకు వచ్చినవారు ముందుగా పెరిగిన తుప్పలను, చెట్లను తొలగించాల్సి వస్తోంది. బోరుబావి చుట్టూ కూడా తుప్పలు పెరిగినందున తలకొరివి పెట్టేవారు నీటి కోసం నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలు స్పందించి శ్మశానవాటికలో పెరిగిన తుప్పలను తొలగించి, ఆప్తుల అంత్యక్రియల కోసం వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

కళ తప్పిన ఎండాడ చెరువు



విరిగిన బెంచీలు



నిర్వహణ లేక తుప్పలతో నిండిన చెరువు

- నగానికి పైగా వెలగని లైట్లు
- రాళ్లు తేలిన వాకింగ్ ట్రాక్
- ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు
- నిర్వహణ లోపమే ప్రధాన కారణం



వాకింగ్ ట్రాక్ వద్ద మద్యం సీసాలు



బయటకు వచ్చిన విద్యుత్ వైర్లు



వాకింగ్ ట్రాక్ దుస్థితి

కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారిని అనుకుని ఉన్న ఎండాడ చెరువు (ఎండాడ ట్యాంక్ బండ్) కళావిహీనంగా దర్శనమిస్తోంది. నాడు విద్యుత్ వెలుగులతో, చుట్టూ వాకింగ్‌ట్రాక్‌తో సుందరంగా కనిపించిన చెరువు నేడు నిర్వహణ లోపంతో తుప్పలు, డొంకలతో నిండిపోయింది. ఎండాడ చెరువును అధికారులు పట్టించుకోకపోవడంతో నేడు ఈ పరిస్థితికి చేరుకుందని పలువురు సీనియర్ సిటిజన్లు, వాకర్స్ అంటున్నారు.

జీవీఎంసీ 8వ వార్డు మొత్తానికి ఇదే అతి పెద్ద చెరువు. ఈ చెరువు చుట్టూ సేద తీరేందుకు బెంచీలు, చుట్టూ వాకింగ్ ట్రాక్ రోడ్డు, ఎల్ఈడీ లైట్లు, ఆహ్లాదాన్ని పెంచే మొక్కలు, వీటితో పాటు ఓపెన్ జిమ్ ఉండటంతో వార్డులో ప్రతి ఒక్కరు వేకువజామునే ఇక్కడకు వచ్చి కొందరు జిమ్, మరికొందరు వాకింగ్ చేసుకునే వారు. కాసేపు అలా సేద తీరి, వారి పనులు పూర్తి చేసుకునే వారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనపడటం లేదు. వాకింగ్ ట్రాక్ చుట్టూ రాళ్లు తేలడంతో వాకింగ్ చేసే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సరైన నిర్వహణ లేక ఈ చెరువు మందుబాబులకు అడ్డాగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎవరో ఒకరు మద్యం సేవిస్తూ, ఇక్కడికి వచ్చిన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆ ఖాళీ బాటిళ్లను అక్కడే పడేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌లో పలు చోట్ల పుట్టలు ఉండటంతో పాములు కూడా సంచరిస్తున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా ఈ చెరువు చుట్టూ నీరు నిల్వ లేకపోయినా తుప్పలు భారీ స్థాయిలో పెరిగిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఎల్ఈడీ లైట్లు సగానికి పైగా వెలగడం లేదు. సిగ్నల్ పాయింట్‌కు దగ్గరలో ఉన్న గేటు వద్ద మెట్లు సరిగా లేకపోవడంతో మహిళలు, సీనియర్ సిటిజన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపెన్ జిమ్ పరికరాలు తుప్పు పడుతున్నాయి.

ఈ చెరువు చుట్టూ పారిశుధ్య నిర్వహణ పరిస్థితి అడగనవసరం లేదు. ఎక్కడ చూసినా చెత్త చెదారంతో చెరువు నిండిపోయింది. రోజుకు వందలాది మంది వాకింగ్ చేస్తూ ఉండే ప్రాంతంలో ఈ విధంగా ఉన్నా అధికారులు స్పందించకపోవడంతో పలువురు సిటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా అభివృద్ధి చేయకపోయినా, కనీసం గతంలో చేసిన అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించడమేంట పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చెరువుకు పూర్వ వైభవం తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మందుబాబులను కట్టడి చేయాలి



కుటుంబ సభ్యులతో కలసి చెరువు వద్ద వాకింగ్‌కు వస్తుంటాం. కానీ కొందరు మందుబాబుల చేష్టలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. చెరువు చుట్టూ ఉన్న ప్రాంతంలో మద్యం సేవించి, ఆ బాటిల్స్ ఇక్కడ పగలగొట్టి భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. ఇక్కడ పోలీసుల నిఘా ఏర్పాటు చేస్తే పార్కుకు వచ్చేవారికి ధైర్యంగా ఉంటుంది.

– మాదు చంటి, ఎండాడ

వాకింగ్ ట్రాక్‌పై పుట్టలు, రాళ్లు



ఇక్కగా వాకింగ్ ట్రాక్ చుట్టూ కొన్ని చోట్ల పుట్టలు దర్శనమిస్తుంటే, మరికొన్ని చోట్ల రాళ్లు తేలిపోతున్నాయి. వాకింగ్ చేయాలంటే ఇబ్బందికరంగా మారింది. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు ఉండటంతో దుర్వాసనతో ఇక్కడ ఉండలేకపోతున్నాం. – బి.చిన్న, ఎండాడ

ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం

ఎండాడ చెరువు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ, ప్రహరీ నిర్మాణం, చిన్న పిల్లల ఆట సామగ్రి ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. చెరువులో ఉన్న వ్యర్థాలను శానిటేషన్ సిబ్బందితో పూర్తి స్థాయిలో తొలగిస్తాం.

– కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్

ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర



రథాన్ని లాగుతున్న భక్తులు

కొమ్మాది: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వార తొలి రథోత్సవం ఘనంగా జరిగింది. ఇక్కడ మెయిన్ రోడ్డు వద్ద రథాన్ని ఉంచి, అందులోని ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రథంపైకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మెయిన్‌రోడ్డులో భక్తులు పెద్ద సంఖ్యలో రథానికి ఇరువైపులా ఉండి, రథాన్ని లాగుతూ ఊరేగింపు నిర్వహించారు.

దివీస్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీకి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవార్డు అందించింది. దివీస్ యాజమాన్యం యాజమాన్యం ఏటా వేలాది మంది ఉద్యోగులతో చేస్తున్న రక్తదాన శిబిరానికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించారు. శ్రీకాకుళంలోని జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా దివీస్ ప్రతినిధులు మహేంద్ర, మల్లికార్జున ఈ అవార్డును అందుకున్నారు. సంస్థ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 15 ఏళ్లుగా క్రమం తప్పకుండా ఏటా వెయ్యి మందికి పైగా ఉద్యోగులు చేస్తున్న రక్తదానాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ గుర్తించిందని తెలిపారు.

జీవీఎంసీ తాగునీటి సిబ్బంది సమ్మె



ఎండాడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నిరసన చేపట్టిన కార్మికులు

- అర్ధరాత్రి నిరసనతో ప్రారంభం
- నీటి సరఫరాకు అంతరాయం



జీవీఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మంచినీటి సరఫరా సిబ్బంది

మధురవాడ: జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెకు దిగారు. జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేసిన విధంగా తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం బోని గోస్తని హెడ్ వాటర్ వర్క్స్ వద్ద అర్ధరాత్రి నిరసన తెలిపి సమ్మెకు దిగడం విశేషం. శుక్రవారం ఉదయం నుంచి జీవీఎంసీ జోన్–2 పరిధిలోని ఎండాడలో ఉన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద నిరసన చేపట్టారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.దుర్గాప్రసాద్, ఎండాడ సెక్షన్ ప్రెసిడెంట్ చిన్నారావు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం కొద్ది నెలలుగా దశల వారీగా ఆందోళన చేపడుతున్నామని, అయినా ఇప్పటికీ వేతనాలు పెంచకుండా వాయిదాలు వేస్తూ వస్తున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బ్యానర్‌లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినదించారు. కార్యక్రమంలో ఎండాడ సెక్షన్ వైస్ ప్రెసిడెంట్ సతీష్, సెక్రటరీ రవి, జాయింట్ సెక్రటరీ కె.వెంకటేష్, భాస్కర్, రమేష్, శ్రీను, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జోన్–2లో 32,382 కనెక్షన్లు

మధురవాడ జీవీఎంసీ జోన్–2 పరిధిలోని 5 నుంచి 8 వార్డుల వరకు 75మంది సమ్మెలోకి దిగారని వారు తెలిపారు. ఇక్కడ 66,363 గృహాలు ఉండగా 32,382 కుళాయిలు ఉన్నాయి. ఇందులో అపార్ట్‌మెంట్, సెమీ బల్క్ కనెక్షన్లు సుమారు 740 ఉన్నాయి. 50 కమర్షియల్ కనెక్షన్లు కాగా 13బల్క్ వాటర్ కనెక్షన్లు ఉన్నాయి. వీరందరికీ తాగునీరు అందక ఇబ్బందులు మొదలయ్యాయి.

భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన

కొమ్మాది: పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మంచినీటి సరఫరా సిబ్బంది భీమిలి జోనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఇందులో పాల్గొన్న అధ్యక్షుడు ఎస్.రవి మాట్లాడుతూ పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల కమిటీలో సభ్యత్వానికి దరఖాస్తులు

మధురవాడ: వీధి విక్రయదారుల నగర కమిటీలో అనధికారుల సభ్యత్వం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జోన్–2 జోనల్ కమిషనర్ కొట్యాడ కనకమహాలక్ష్మి ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం 2014 జీవో నం.137 ప్రకారం జీవీఎంసీలో వీధి విక్రయదారుల నగర కమిటీలో నలుగురు అనధికార సభ్యుల నియామకానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం స్ట్రీట్ వెండర్స్ అండ్ ట్రేడ్ అసోసియేషన్, రిజిస్టర్డ్ ఎన్‌జీవో, సీబీవో, టౌన్ లెవెల్ ఫెడరేషన్ లీడర్, నివాసిత సంక్షేమ సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు నోటిఫికేషన్ ఇచ్చిన 3 రోజుల్లో రిజిస్టర్డ్ పోస్టు ద్వారా గానీ నేరుగా గానీ జోన్–2 మధురవాడ కార్యాలయం యూసీడీ విభాగంలో గల డ్రాప్ బాక్సులో జూన్ 30వ తేదీ సాయంత్రం 5గంటల లోగా దాఖలు చేయాలని కోరారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాల కోసం కార్యాలయ పని దినాలలో ఏపీడీ శ్రీరామ్‌ను సంప్రదించాలని సూచించారు.

గృహ నిర్మాణ కాలనీలకు తాగునీరు, విద్యుత్

మంత్రి కొలుసు పార్థసారధి హామీ



గిడిజాల గృహ నిర్మాణ లే అవుట్‌లో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖా మంత్రి పార్థసారధి

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాలలోని జగనన్న కాలనీలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి శుక్రవారం పర్యటించారు. గత ప్రభుత్వం వదిలేసిన గృహ నిర్మాణ కాలనీలకు లబ్ధిదారుల కోరిక మేరకు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణ నిధులపై మాట్లాడుతూ, 2014–19 టీడీపీ పాలనలో రూ. 2.50 లక్షలు నేరుగా లబ్ధిదారులకు ఇవ్వగా, గత వైసీపీ ప్రభుత్వం రూ. 30 వేలకు తగ్గించిందని విమర్శించారు. డ్వాక్రా మహిళలు మంజూరైన రూ. 35 వేలతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు ఇచ్చే ఆలోచనలో ఉందని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ. 2.50 లక్షలతో పాటు, ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, బీసీలకు రూ. లక్ష అదనంగా అందిస్తామని ప్రకటించారు. గిడిజాలలో అనర్హులకు కేటాయించిన ఇళ్లపై విచారణ జరిపి తొలగిస్తామని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడానని, కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు.

బీజేపీ, జనసేన నిరసన

మంత్రి సభ వేదికపై ప్రధాని మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలు లేకపోవడంతో బీజేపీ, జనసేన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. వారిని అవమానిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేయగా, వెంటనే టీడీపీ నాయకులు ఫొటోలను అతికించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన



గొట్టిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

తగరపువలస: ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంపై అవగాహన కోసం శుక్రవారం జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీ అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తడి పొడి చెత్త సేకరణ విషయమై గ్రామంలో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ క్లీనింగ్, తాగునీటి సరఫరా గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఇంటి వద్దే చెత్త వేరుచేసి ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ గంటా జగదీశ్వరరావు, ఎంపీడీవో జానకి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి అవస్థలు



విల్సన్‌పేటలో నీటి కోసం కుళాయి వద్ద ఉంచిన బిందెలు, బక్కెట్లు

తగరపువలస: జీవీఎంసీ తాగునీటి సరఫరా అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల పెంపు కోసం గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగడంతో భీమిలి జోన్ ప్రజలు శుక్రవారం తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. సిబ్బంది సమ్మె విషయం తెలియని మహిళలు యథావిధిగా ఉదయాన్నే బిందెలు, బక్కెట్లు పట్టుకుని కుళాయిల వద్దకు చేరుకున్నారు. తరువాత విషయం తెలుసుకుని సమ్మె విరమించకపోతారా, నీరు సరఫరా చేయకపోతారా అంటూ ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. దీంతో వ్యాటర్ క్యాన్లు కొనుక్కుని తెచ్చుకున్నారు.

మొరాయించిన బోర్లు

ఇటీవల ఎండలకు పలుచోట్ల బోరుబావులు అడుగంటిపోవడంతో పాటు క్యాన్ల ద్వారా నీటిని విక్రయించేవారు ఎడాపెడా నీటిని తోడేయడంతో వ్యక్తిగత బోర్లు కూడా మొరాయించాయి.

సమ్మెలో 62మంది సిబ్బంది

భీమిలి జోన్ పరిధిలో సుమారు 63 మంది తాగునీటి సరఫరా సిబ్బంది ఉండగా అందులో ఒకరు తప్ప మిగిలిన వారంతా అవుట్ సోర్సింగ్ కార్మికులే. దీంతో పర్మినెంట్ వర్కర్ ఒక్కరే తగరపువలస, చిట్టివలస పరిధిలో జెడ్పీ స్కూల్, గణేష్ థియేటర్ వెనుక, రాములమ్మ థియేటర్ ప్రాంతం, కొత్తపేట మార్గాలలో పాక్షికంగా నీటిని విడుదల చేశారు. గురువారం పనిచేసిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది పంప్‌హౌస్‌ల ద్వారా కృత్రిమ రిజర్వాయర్లను నింపడంతో ఈ విడుదల సాధ్యమైంది. శనివారం నాటికి అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె విరమించకపోతే ఈ పాక్షిక నీటి విడుదల కూడా సాధ్యం కాదు. జోన్‌లో అయిదు రిజర్వాయర్లు, మూడు పంప్‌హౌస్‌లు, వీధులలో టర్న్ ఆపరేటర్లు కలిపి 75 పాయింట్లకు పైగా ప్రాంతాల నుంచి తాగునీరు విడుదల చేస్తుంటారు. కార్మికుల సమ్మెతో వీధి కుళాయిల వద్ద హడావుడి కనిపించలేదు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

కొమ్మాది: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, జార్ఖండ్ రాష్ట్ర పోలీస్ ఐజీ క్రాంతికుమార్ మంచిమార్కులు సాధించిన విద్యార్థులకు కొద్ది సంవత్సరాలుగా నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది ఆయన మాతృమూర్తి వెంకటరత్నం చేతులమీదుగా ప్రథమ స్థానం సాధించిన వి.సత్య అలేఖ్యకు రూ. 10 వేలు, ద్వితీయ స్థానం పొందిన పి.సంజనకు రూ. 5 వేలు, తృతీయ స్థానం పొందిన షణ్ముఖరెడ్డికి రూ. 3వేలు అందించారు.

వేదిక ప్రారంభం

పాఠశాల పూర్వ విద్యార్థి, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) సభ్యుడైన మంథా శ్రీధర్ తన తల్లి మంథా అన్నపూర్ణ జ్ఞాపకార్థం ఇక్కడి వేదికకు మరమ్మతులు చేయించారు. ఆ వేదికను ఈ సందర్భంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల శత జయంతి కమిటీ కో–ఆర్డినేటర్ మైలపల్లి షణ్ముఖరావు, కన్వీనర్ మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి పూసర్ల శ్రీనివాసరావు, ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ, సభ్యులు, స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మిక్సర్ ట్యాంక్‌లో పడి కూలీ దుర్మరణం



వెంకటరమణ(ఫైల్)

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ పరిధిలోని వీఎస్ఎల్ వద్ద కోరమాండల్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఓలేటి వెంకటరమణ(57) అనే కూలీ దుర్మరణం చెందాడు. వివరాలివి.. పెందుర్తి జేఎన్ఎన్‌యుఆర్ఎంలో నివసిస్తున్న వెంకటరమణ కోరమాండల్ పెయింట్స్‌లో పని చేస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే పనికి వచ్చిన ఆయన ఫస్ట్ ఫ్లోర్‌లోని బాల్‌మిల్‌లో ఉన్న పెయింట్స్ తయారీ ప్రక్రియలో మిక్సర్ ట్యాంకును శుభ్రం చేసే క్రమంలో దిగాడు. అనంతరం అది రన్ అవడంతో, ఆయన శరీరం మాంసఖండాలుగా విడిపోయి ఎముకలు, రక్తసిక్తంతో భయానకంగా కనిపించింది. దీనిపై మృతుని కుమారుడు ఆనందపురం పోలీసులను ఆశ్రయించాడు. సీఐ వాసునాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుని శరీర విడిభాగాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించనున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు పడిపోయాడా, దిగాడా, ఇంకేమైనా జరిగిందా అన్న విషయంపై విచారణ జరపనున్నట్టు సీఐ తెలిపారు. ప్రస్తుతానికి యాజమాన్యం లేదా బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్టు తెలియజేశారు.

అంధ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లో గల ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలో 2025–26 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డి.విజయ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 48 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కనీసం 40 శాతం దృష్టిలోపం ఉన్న 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల బాలికలు అర్హులని తెలిపారు. పాఠశాల ప్రవేశ సమయంలో సూచించిన వైద్య ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా సమర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థినులకు ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ మెటీరియల్‌తో విద్య, కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతికతలో ప్రత్యేక శిక్షణను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం 90144 56753, 9059771759 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.1.40 లక్షల ఫైన్

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 14మందికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పి.స్వాతి భవాని శుక్రవారం ఫైన్ విధించారు. ఒక్కొక్కరికి రూ.10వేలు వంతున రూ.1.40 లక్షలు ఫైన్ విధించినట్టు ట్రాఫిక్ సిబ్బంది తెలిపారు.